
సాక్షి పల్నాడు

సోమవారం । 2 । జూన్ । 2025



సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 512.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



అలరించిన వేణుగాన కచేరి

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై ఆదివారం జరిగిన కృష్ణకిశోర్, శశాంక్, జనార్దన్‌ల వేణుగాన కచేరీ ఆకట్టుకుంది.

నేడు వల్లభేశ్వరుడి వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో గల వల్లభేశ్వరస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తారు. ఉదయం నుంచి విశేష పూజలు, హోమాలు జరుగుతాయి.

ఫ్రీ బస్సు రోడ్డు ఎక్కేనా ?

- ఏడాదిగా బస్సుల కోసం మహిళల ఎదురుచూపు
- పథకం అమలు కోసం బస్సులు, డ్రైవర్లు కరువు
- జిల్లాలో మొత్తం 10.92లక్షల మంది మహిళలు
- ఏడాదిగా రూ.147కోట్ల లబ్ధిని కోల్పోయిన మహిళలు

కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాదిరిగా ప్రతి మహిళా ఉచితంగా ప్రయాణించేలా ఉచిత బస్సు (ఫ్రీ బస్సు) పథకం అమలు చేస్తానని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఊదరగొట్టారు. మాయ మాటలు చెప్పి మహిళలతో ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు దాని అతీగతీ లేదు. తొలుత దసరా అన్నారు.. తర్వాత దీపావళి.. ఆ తర్వాత సంక్రాంతి అన్నారు..చివరకు వచ్చే ఆగస్టు 15 నుంచి అమలు చేస్తానని మహానాడులో ప్రకటించారు. ఇదీ కష్టమేనని ఆర్టీసీ పరిస్థితులపై అవగాహన ఉన్న సంస్థ ఉద్యోగులు అంటున్నారు.



నరసరావుపేట డిపోలో పల్నాడు వైపు వెళ్లే బస్సులో ఎక్కేందుకు అవస్థలు పడుతున్న మహిళలు

నరసరావుపేట: పక్కనే ఉన్న తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేసి చూపితే, మన రాష్ట్ర పెద్దలు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేమంటే గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడటంతో అమలు చేయలేకపోతున్నామంటూ కుంటి సాకులు చెబుతున్నారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టించి, ప్రజలకు పథకాలు అమలుచేస్తానన్న చంద్రబాబు ఇప్పుడు సాకులు వెతుకుతుండటం శోచనీయమని మహిళలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ సాక్షిగా పథకాలు అమలు చేయాలంటే భయంగా ఉందంటూ చంద్రబాబు వ్యాఖ్యలపై మహిళలు, ప్రజలు విస్తుపోతున్నారు. అసలు ఫ్రీ బస్సు అమలు చేస్తారా లేదా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. పథకం అమలుపై ఇప్పటి వరకు ముఖ్యమంత్రి, మంత్రి, అధికారులు చర్చించిన దాఖలాలు లేవు.

జిల్లా కేంద్రానికి నిత్యం రాకపోకలు

మూడేళ్ల కిందట నరసరావుపేట కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటైంది. దీంతో పలు ప్రాంతాల నుంచి మహిళా ఉద్యోగులు, ఉపాధి కోసం మహిళా కూలీలు జిల్లా కేంద్రానికి ప్రతిరోజూ రాకపోకలు చేస్తున్నారు. వందలాది మంది విద్యార్థినులు ఇంజినీరింగ్‌తో పాటు పలు ఉన్నత విద్యా విద్యా సంస్థలకు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట డిపో ద్వారా ఆర్టీసీ 90 బస్సుల ద్వారా 106 సర్వీసులను నడుపుతోంది. అందులో 65 బస్సులు సంస్థవి కాగా, మరో 25 అద్దెవి. వీటిలో పల్లె వెలుగు 47 బస్సులు ఉన్నాయి. మిగిలినవి హైటెక్, అల్ట్రా, ఎక్స్‌ప్రెస్ బస్సులు. ప్రతిరోజూ ప్రయాణికుల ద్వారా రూ.13 లక్షల నుంచి రూ.14లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. జిల్లావ్యాప్తంగా సంస్థకు నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల ఉన్నాయి. ఫ్రీ బస్సు ఏ విధంగా అమలుచేస్తారనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. కేవలం జిల్లాకు లేదా నియోజకవర్గానికే పరిమితం చేస్తామని కూటమి నేతలు లీకులు వదులుతున్నారు.

పథకానికి నియోజకవర్గాల వారీగా అర్హత పొందే మహిళలు ఇలా

నియోజకవర్గం	మహిళల సంఖ్య
నరసరావుపేట	1,47,027
చిలకలూరిపేట	1,47,432
సత్తెనపల్లి	1,50,506
పెదకూరపాడు	1,44,252
గురజాల	1,72,853
మాచర్ల	1,67,725
వినుకొండ	1,62,957
మొత్తం	10,92,752

జిల్లాలో భారీగా మహిళలు

పల్నాడు జిల్లాలో ఐదేళ్ల మొత్తం 10,92,732మంది మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాల్సి ఉంది. అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. దీని వల్ల ఉపాధి, ఉద్యోగాలు, వైద్యం, వివిధ పనులపై నిత్యం బస్సుల్లో ప్రయాణించే మహిళలు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఆర్టీసీ పరిధిలో 461బస్సులు నిత్యం 2995 ట్రిప్పులు చొప్పున రోజుకు 1.73,573 కిలోమీటర్లు తిరుగుతున్నాయి. రోజుకు సగటున 1,41,717మంది మహిళలు ప్రయాణిస్తుండగా రూ.59.22లక్షల ఆదాయం సమకూరుతోంది. ఉచిత పథకం సరిగా అమలుచేస్తే జిల్లాలోని మహిళలకు ఏడాదికి రూ.146కోట్లు లబ్ధి చేకూరనుంది.

మహిళలకు ఎంతో ఉపయోగం



తెలంగాణలో పథకం అమలు చేసినా ఇక్కడ ఏడాదిగా అమలు చేయకపోవడం దారుణం. చంద్రబాబుకు ఉచితంగా ఇచ్చే మనస్తత్వం లేదు. పేదలంటే పడదు. వారికేమి చేయడు. ఫ్రీ బస్సు పథకం అమలుచేస్తే మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

–ఎస్.సుజాతాపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ , నరసరావుపేట

ఇప్పటి వరకు ప్రణాళిక లేదు



ఉచిత బస్సు గురించి ఇప్పటి వరకు మాకెటువంటి సంకేతం అందలేదు. జిల్లాలో కూడా సర్వే చేయలేదు. ప్రభుత్వం ఆదేశిస్తే ఉన్న బస్సులతోనే పథకం అమలుచేసేందుకు ప్రయత్నాలు చేస్తాం.

– ఎం.మధు, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి హానికరం



గుంటూరు వెస్ట్ : మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తులకే కాదు సమాజానికి కూడా తీవ్ర హానికరమని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలసి మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేక ర్యాలీని ప్రారంభించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాషా ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈనెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ 26 రోజులపాటు ర్యాలీలు, సభలు, సమావేశాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020 నుంచి నాషా ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలతోపాటు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడమే దీని ధ్యేయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని నిరంతరం గమనిస్తుండాలని సూచించారు. అనంతరం జరిగిన ర్యాలీలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు, ఎస్పీ, ఎక్సైజ్ సూపరిండెంట్ అరుణకుమారి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన హనుమత్ జయంతి వేడుకలు



తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీసువర్చలాసమేత శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక శ్రీహనుమత్ జయంతి, 17వ లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మే 22వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం ఉదయం పూర్ణాహుతితో ముగించారు. తొలుత లక్ష హనుమాన్ చాలీసా పారాయణ పత్రికలకు ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస ఆగమ పండితుడు నాగ మారుతి బృందం విశేష పూజలు నిర్వహించింది. సాయంత్రం ఊంజల సేవ, పండిత ఆశీర్వచనం జరిగాయి. ఉత్సవాల పూర్ణాహుతి సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 1500 వందల మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అర్చకులు కిరణ్‌కుమార్, సురేష్, గ్రూప్–2 దేవాలయాల కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్, కౌన్సిలర్లు పి.త్రిమూర్తి, దేసు యుగంధర్, గౌడవర్తి సాయిహరేరామ్, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, బచ్చు లీలాప్రసాద్ రావు, మాజేటి వెంకటేష్, సంకా శివప్రసాద్, మద్దు హరీష్ వెంకట మణిసాయి, బిట్రా రఘు, గోలి సోమశేఖర్, వెచ్చా కిశోర్, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

వీలున్నప్పుడే రేషన్ తీసుకోండి

ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



గుంటూరు వెస్ట్ : వీలున్న సమయంలోనే రేషన్ తీసుకోవచ్చని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. రేషన్ పంపిణీ తొలి రోజు స్థానిక వసంతరాయపురంలోని షాప్ నెంబర్ 61లో ఆయన సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1-15వ తేదీ వరకు ఉదయం 8 – 12, సాయంత్రం 4– 8 గంటల మధ్య సరుకులు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు వీలున్న సమయంలోనే రావచ్చని ఆయన తెలిపారు. ఈ–పోస్ మిషన్లు, వేయింగ్ మిషన్లు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. దుకాణదారులు ఇబ్బందులకు గురిచేస్తే సమీపంలోని అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. రేషన్ పంపిణీ విధానాన్ని ఆయన పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్‌ఓ చంద్రముని, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం



నరసరావుపేట: యోగాతో శారీరక దృఢత్వం తోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా ఆదివారం నరసరావుపేటలోని పల్నాడు బస్టాండ్, పెద్ద చెరువు రోడ్డు వద్ద కార్యక్రమాలను పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ 30 నిమిషాల నుంచి గంట వరకు యోగాభ్యాసం చేయాలని సూచించారు. యోగాతో శారీరక రుగ్మతలు దూరమవుతాయని పేర్కొన్నారు. యోగా అనేది చాలా ప్రాచీనమైనదని, వందల ఏళ్ల నుంచి గుర్తింపు పొందిందని అన్నారు. జూన్ 21 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని, శిక్షణ అనంతరం యోగాను ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. తద్వారా ఆయుష్షు పెరుగుతుందని, యోగ సాధనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. వందల మంది పాల్గొని యోగాభ్యాసం చేశారు. జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్మార్త వేద పాఠశాలలో ప్రవేశాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఆధ్వర్యంలో పోరంకిలో నిర్వహిస్తున్న స్మార్త వేద పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి వేద పాఠశాల పునఃప్రారంభం కానుందని, విద్యాభ్యాసం కోసం విద్యార్థులు ప్రవేశ దరఖాస్తులను పొందవచ్చని పేర్కొన్నారు. సమాజ వికాసానికి తోడ్పడే వేద విద్య అభ్యున్నతికి, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు దేవస్థానం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

మళ్లీ రేషన్ కష్టాలు

- తొలిరోజు సరకుల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు
- పలుచోట్ల ఈ– పోస్ మిషన్లు మొరాయింపు
- పనిచేయని ఎమ్మెల్యే మాధవి ప్రారంభించిన దుకాణం
- ఇంటివద్దకే సరకులు ఇచ్చే వ్యవస్థ నాశనం చేసిన కూటమి ప్రభుత్వం
- పాలకుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం



ఉదయం 10.12 గంటలకే బయోమెట్రిక్ సర్వర్ ఆగిపోయిందని చూపుతున్న రేషన్ డీలర్ గాలీబ్

గుంటూరు వెస్ట్: రేషన్ పంపిణీ తొలిరోజే విఫలమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఎండీయూ వాహనాలను కాదని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ ప్రారంభించింది. దీని కోసం నాయకులతోపాటు కార్యకర్తలను రేషన్ దుకాణాలకు పంపి హడావుడి చేసింది. ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. చాలాచోట్ల ఈ పోస్ మిషన్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గల్లా మాధవి స్థానిక ఏటీ అగ్రహారం రేషన్ దుకాణం నెంబర్ 0781174ను ప్రారంభించారు. కొద్ది సేపటికే అక్కడ ఈ పోస్ మిషన్ మొరాయించింది. జిల్లాలో మొత్తం 972 రేషన్ దుకాణాలున్నాయి. 5,99,511 మందికి సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. తొలి రోజు మాత్రం పెద్దగా స్పందన లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేటప్పుడు పేదలకు ఎంతో సౌలభ్యంగా ఉండేది. ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని కార్డుదారులు వాపోతున్నారు.

తప్పని సమస్యలు

చాలా దుకాణాల్లో సర్వర్ మొరాయించింది. కొన్ని చోట్ల నెమ్మదించింది. దాదాపు 5 సంవత్సరాల పాటు ఈ పోస్ మిషన్లు, వేయింగ్ మిషన్లు వాడకపోవడంతో అవి చాలా వరకు పాడైపోయాయి. ఇంటి వద్దకే రేషన్ తీసుకోవడానికి అలవాటు పడ్డ ప్రజలు దుకాణాలకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. కొన్ని చోట్ల లైన్లు కనబడగా, మరికొన్ని చోట్ల ఎవ్వరూ రాలేదు. మిషన్లు పనిచేయకపోవడంతో ప్రజలు తిరిగి వెళ్లిపోయారు. కూటమి నేతలు తమ కార్యకర్తలను తీసుకుని రేషన్ దుకాణాల్లో హల్‌చల్ చేయడం కనిపించింది. రేషన్ తీసుకోవాలని కొంత వరకు స్థానికంగానూ ప్రచారం చేశారు. ఎండీయూ వాహనాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం రేషన్ దుకాణదారులు చేసే అక్రమాలను ఎలా నివారిస్తోందో చెప్పకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు పేర్కొన్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



పనులు చేసుకునే మాకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానం చాలా బాగుంది. దానికి పూర్తిగా అలవాటు పడ్డాం. ఇప్పుడు రేషన్ దుకాణాలు మాకు దూరంగా ఉన్నాయి. వెళ్లి వరుసలో నిలబడి తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం దీనిపై పునరాలోచించుకోవాలి – కె.మిర్యామ్, గుంటూరు

ఎందుకు మార్చారు?



ఇప్పుడు కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకులు పంపిణీ ఎందుకు చేస్తోందో అర్థం కావడం లేదు. ఇంటి వద్దకే బండ్లు వచ్చి రేషన్ పంపిణీ చేసిన తీరు బాగుంది. అందులో ఏమన్నా ఇబ్బందులుంటే సరిచేసుకోవాలే గానీ ఇలా ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు? – చౌటుపల్లి చిట్టెమ్మ, గుంటూరు

వెనక్కి వచ్చేశాం



సరకులు తీసుకుందామని దుకాణానికి వెళితే అక్కడ సర్వర్ పనిచేయలేదని చెప్పారు. చాలా సేపు వేచి చూసినా సర్వర్‌లు అందుబాటులోకి రాలేదు. ఈసురోమంటూ వెనక్కి రావాల్సి వచ్చింది. రాజకీయాలుంటే వారు చూసుకోవాలి గానీ, ప్రజల్ని ఇబ్బంది పెట్టడం తగదు. – షేక్ మరింబి, గుంటూరు

సాయంత్రానికి సరకులు ఇచ్చారు



నేను ఉదయం 10 గంటలకు రేషన్ దుకాణానికి వెళితే సాయంత్రం 5 గంటలకు నా వేలిముద్ర పడింది. మాకు ఈ నెల రాగులు, కందిపప్పు ఇస్తామని చెప్పారు. రేషన్ షాపు యజమానిని అడిగితే ఇచ్చింది తీసుకెళ్లు.. లేనివి ఎలా ఇస్తామనే నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నాడు.

– పి.లక్ష్మణ్, గుంటూరు

కూటమి మోసాలను ఎండగట్టేందుకే ‘వెన్ను పోటు’ దినం

- మాజీమంత్రి విడదల రజిని
- 4న చిలకలూరిపేటలో భారీ ర్యాలీ
- ప్రజలతో కలిసి అధికారులకు వినతిపత్రాల సమర్పణ
- పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి విడదల రజిని, నాయకులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: వెన్నుపోటుకు ఆద్యుడు..వెన్నుపోటుకే ఓ ప్రత్యేక దినం అవసరాన్ని తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని విమర్శించారు. చిలకలూరిపేటలో జూన్ 4వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన జరగనున్న ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమ పోస్టర్‌ను పార్టీశ్రేణులతో కలిసి ఆదివారం ఆమె నివాసంలో ఆవిష్కరించారు. ప్రజల మద్దతుతో జరిగే ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2024 జూన్ 4న అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ‘సూపర్‌సిక్స్’ పాటు మరో 143 హామీలు ఇచ్చిందని, ఏడాది గడిచినా ఒక్క దాన్ని కూడా అమలు చేయలేదని అన్నారు. సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల ఖాతాల్లో నేరుగా నగదు జమచేసి పారదర్శక పాలన అందించి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అరాచక పాలన సాగిస్తూ.. నిత్యం కల్లబొల్లి మాటలతో ప్రజలను చంద్రబాబు మభ్య పెడుతున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడమే పార్టీ ఎజెండాగా పెట్టుకున్నారంటూ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు గల్లంతవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారని రజిని హెచ్చరించారు. జూన్ 4న జరగనున్న ‘వెన్నుపోటు దినం’ కేవలం నిరసన కార్యక్రమం కాదని, అది హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రజల గళం అని పేర్కొన్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా కదిలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రజిని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా యూత్ అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, జిల్లా వైస్‌ప్రెసిడెంట్ మద్దూరి కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ మద్దూల విజయబాలచంద్రారెడ్డి, రూరల్ ఎంపీపీ దేవినేని శంకర్రావు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, సింగారెడ్డి కోటిరెడ్డి, కల్లి వెంకటరెడ్డి, మైలా రాజేష్, పందుల బుల్లెబ్బాయి, వడ్డేపల్లి నర్సింహరాజు, కుప్పాల ప్రభుదాసునాయుడు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు తదితరులు

గురజాల: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడు నైజం అని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని, ఇందుకు నిరసనగా జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో గెలుపొందిన రెండు నెలల్లోనే బ్రాహ్మణపల్లి సమీపంలో మెడికల్ కళాశాలను స్థాపించామని తెలిపారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు నిధులు తీసుకువచ్చి 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. గురజాల నియోజకవర్గాన్ని రూ.3500 కోట్లతో అభివృద్ధి చేశామని, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా కూటమి నేతలు ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టును ఆశ్రయించి జానపాడు రైల్వే బ్రిడ్జి పనులు చేపట్టేలా చూశామని చెప్పారు. మెడికల్ కళాశాల కూడా ప్రారంభించేలా చూస్తామన్నారు. అనంతరం వెన్నుపోటు దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, మాజీ కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె. అన్నారావు, కర్రా చిన్న కోటేశ్వరరావు, వేముల చలమయ్య, కావూరి అంజిబాబు, మహంకాళి యశోద దుర్గ, చల్లా కాశీబాబు, జక్కా సత్యం, షేక్ నాసర్ సైదా, బండ్ల వెంకయ్య పాల్గొన్నారు.

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా, నాయకులు

వినుకొండ : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ ఏడాదిలోనే 99శాతం అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వినుకొండలో ఉదయం 10గంటలకు వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించి ఎన్నికల హామీలను అమలు చేయాలంటూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు.

పింఛన్ల నిలిపివేత దుర్మార్గమైన చర్య

శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామంలో 72 పింఛన్లు ఆపివేయడం దుర్మార్గమైన చర్య అని బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. ఎక్కడా లేని విధంగా రాజకీయ కక్షతో, దురుద్దేశంతోనే పింఛన్‌లను తొలగించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో ఆదివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,100 గరిష్టం : రూ. 3,400

మోడల్ ధర రూ. 2,600

క్లుప్తంగా

విలువలతో కూడిన విద్యా విధానం అభినందనీయం

హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవి



గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యా విధానం అభినందనీయమని హైకోర్టు జడ్జి జస్టిస్ చీమలపాటి రవి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరులోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ హైస్కూల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాటిబండ్ల సీతారామయ్య ఆశయాలకు అనుగుణంగా నేటి సమాజానికి మంచి విలువలు అందేలా తమదైన శైలిలో విద్యాబోధనతో పాఠశాలను నడపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, దేవినేని శేషగిరిరావు, దామచర్ల శ్రీనివాసరావు, గుంటుపల్లి హరగోపాల్ పాల్గొన్నారు.

ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు ఎస్జీటీలతో భర్తీ చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులను ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 219 మంది జూనియర్ స్కూల్ అసిస్టెంట్ టీచర్లను నిర్బంధంగా బదిలీ చేయడాన్ని ఆపాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను ఆదివారం నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూల్లో కలిసిన యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు ఆమెకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం పోస్టులలో స్కూల్ అసిస్టెంట్లకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. విద్యాశాఖ అధికారులు హడావుడి నిర్ణయాలు మానుకోవాలని తెలిపారు. డీఈఓను కలిసిన వారిలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, సీనియర్ నాయకులు పి.హనుమంతరావు, చెన్నకేశవరావు, గఫార్, వినోద్ పాల్గొన్నారు

ఆరోగ్యానికి సైక్లింగ్

డీఎస్‌ఓ నరసింహారెడ్డి



ర్యాలీలో పాల్గొన్న నరసింహారెడ్డి, ఆనంద్ బెంజిమెన్, చిన్నారులు

నరసరావుపేట ఈస్ట్: ఆరోగ్యకర జీవనానికి సైక్లింగ్ ఉత్తమ వ్యాయామంగా దోహదపడుతుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆదివారం ఎర్త్ హీరో ఫౌండేషన్ భాగస్వామ్యంతో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం నిర్వహించారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో సైకిల్ ర్యాలీని ప్రారంభించిన డీఎస్ఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రపంచ సైకిల్ దినోత్సవంతోపాటు సండేస్ ఆన్ సైకిల్ నిర్వహించాలని ఆదేశించినట్లు వివరించారు. శరీరానికి వ్యాయామాన్ని అందించే సైక్లింగ్‌ను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.ఆనంద్ బెంజిమెన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ రక్షణ, ఆరోగ్యవంతమైన జీవనశైలిని పౌరులకు పరిచయం చేసేందుకే సండేస్ ఆన్ సైకిల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్టేడియం కోచ్‌లు చావా శ్రీనివాసరావు, మద్దాలి సైదారావు, ఖేలో ఇండియా పీఈటీ ఇజ్రాయిల్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘గ్రీన్‌లైట్ ఏరియా’ కథా సంపుటి ఆవిష్కరణ



కథా సంపుటి ఆవిష్కరిస్తున్న సృజన, రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: వడలి రాధాకృష్ణ (చీరాల) రచించిన కథా సంపుటి ‘గ్రీన్ లైట్ ఏరియా’ ఆవిష్కరణ ఆదివారం రాత్రి స్థానిక కమఠేశ్వరస్వామి ఆలయంలో సృజన, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించి తొలి ప్రతిని చెన్నుపాటి రామాంజనేయులుకు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించారు. కథా రచయిత్రి పాలపర్తి జ్యోతిష్మతి మాట్లాడుతూ రాధాకృష్ణ కథలు ప్రత్యేకమైన శైలిలో సమాజంలోని సమస్యల పరిష్కారం దిశగా సాగుతాయని తెలిపారు. అనంతరం ఇటీవల ఉగాది పురస్కారం పొందిన వడవల్లి రాధాకృష్ణ, ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురస్కారాన్ని అందుకున్న నాగనేని రామకృష్ణ, ఎన్టీఆర్ పురస్కారాన్ని అందుకున్న మన్నం త్రిమూర్తులు, పెద్దినేని సురేంద్రబాబు, రక్తదాన ప్రోత్సాహకులు చుండూరి మురళీ సుధాకర్‌లను సృజన, రోటరీ క్లబ్ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, వీరవల్లి రుద్రయ్య, కోట అంజమ్మ, కొల్లా భువనేశ్వరి, జ్యోతి చంద్రమౌళి, కృష్ణమోహన్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, షేక్ మస్తాన్, రావూరి రంగయ్య, లెవీ ప్రసాద్ పాల్గొన్నారు.

కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించాలి



డీలర్‌కు స్టాక్ రిజిస్టర్ అందిస్తున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల టౌన్: కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖరనాయుడు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా మండలంలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, పట్టణంలోని పలు వార్డుల్లోని రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు సరుకులు పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి డీలర్ విధిగా ప్రతి నెలా 15వ తేదీలోగా కార్డుదారులకు సరుకులు అందించాలని ఆదేశించారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దుకాణాలు తెరచి ఉంచాలని తెలిపారు. ప్రతి డీలర్ విధిగా స్టాక్ రికార్డులు, బోర్డుల్లో సరుకుల కేటాయింపులు, నిల్వలను తెలియజేయాలని చెప్పారు. సరుకుల పంపిణీలో వ్యత్యాసాలు, అధిక ధరలకు అమ్మకాలు, బియ్యాన్ని ఇవ్వకుండా డబ్బులకు కొనుగోలు చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ, వీఆర్వోలు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుళ్ల పరీక్షలు

నగరంపాలెం: జిల్లాలో పోలీస్ కానిస్టేబుళ్ల పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి అనుమతించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటుచేశారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గుంటూరు నగరంలోని విజ్ఞాన్ నిరులా, ఏసీ కళాశాల తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు రాసే అభ్యర్థుల సంఖ్య, మౌలిక సౌకర్యాల ఏర్పాటుపై పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 10,400 మందికి పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

నాదెండ్ల: జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొని ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాపురం గ్రామ పరిధిలోని తిరుమల స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే ప్రీతమ్ మాలిక్ (24) సోదరుడు శ్రీతమ్ మాలిక్ కుటుంబంతో కలిసి స్థానిక స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. రెండేళ్లుగా క్వార్టర్స్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. రెండు నెలల కిందట ప్రీతమ్ మాలిక్ ఒడిశా నుంచి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. శనివారం రాత్రి మిత్రుడు లిట్టూతో కలిసి ప్రీతమ్‌మాలిక్ ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వెళ్లి తిరిగి వస్తున్నాడు. ప్రసన్న వంశీ స్పిన్నింగ్‌మిల్లు వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రీతమ్ మాలిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. లిట్టూకు గాయాలు కావటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్ట్ ఆఫీసర్ల ఆధీనంలో వన్యప్రాణి మాంసం విక్రేతలు

యడ్లపాడు: వన్యప్రాణి మాంసాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండవీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హరిణి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సొలసి గ్రామ పరిధిలో శనివారం రాత్రి అడవి పంది మాంసాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమై మెరుపుదాడి చేశారు. సొలస గ్రామానికి చెందిన మల్లా గోపయ్య, ప్రసాద్, శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మాంసంతో పాటు నిందితులను జిల్లా ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు సమాచారం. సోమవారం వీరిని జిల్లా అటవీశాఖ అధికారి విచారించి తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: ఈత అత్యుత్తమ వ్యాయామమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో 11వ సీనియర్ అంతర్ జిల్లాల స్విమింగ్ ఛాంపియన్‌షిప్‌– 2025 పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు పలు ప్రణాళికలు రూపొందించిందని వివరించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 105 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ కె.రవికాంత్, అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, కార్యదర్శి మోహనవెంకటరామ్, కోశాధికారి రమేష్, పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన విజయ్‌కుమార్

దాచేపల్లి: అతివేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇందిరాకాలనీకి చెందిన కొమ్మా విజయ్‌కుమార్(58)తన ఇంటి నుంచి హైవే రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల వైపు నుంచి అతివేగంగా వస్తున్న వాహనం అతనిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జీ. పాపారావు సంఘటన స్థలాన్ని పరిశీలన చేశారు. ఢీకొట్టిన వాహనం కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రీడాకారులను తీర్చిదిద్దడం గొప్ప విషయం



వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులతో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

చినగంజాం: క్రీడాకారులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం గొప్ప విషయం అని హైదరాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అన్నం వేణుగోపాల్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరానికి శిక్షకుడుగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు గిరిబాబు వ్యవహరించి ప్రతి రోజూ శిక్షణ అందించారని, అనేక మంది యువ క్రీడాకారులు ప్రేరణ పొందారన్నారు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి జూన్ 1వ తేదీ వరకు గ్రామీణ యువతకు కబడ్డీపై శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిర్వహించామని.. శిబిరం విజయవంతంగా ముగిసిందన్నారు. కోచ్ గిరిబాబు మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 150 మంది బాలలకు శిక్షణ ఇచ్చామని, శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు డాక్టర్ నల్లూరి సుబ్బారావు రూ.లక్ష విరాళంగా అందజేశారని తెలిపారు. దీంతో క్రీడాకారులకు పౌష్టికాహారం, కబడ్డీ కిట్‌లు అందజేశామన్నారు. శిబిరంలో సీనియర్ క్రీడాకారులు బి.నాగాంజనేయులు, వెంకటేష్, కె.సతీష్‌రెడ్డి, బి.శివారెడ్డి, డి.సుబ్బారెడ్డి, వి.వెంకటేశ్, జీటీ అంకిరెడ్డి, ఎం.భాను ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొనగా, వారి సలహాలు సూచనల మేరకు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి, క్రీడాకారులకు భోజన వసతి కల్పించేందుకు అన్నం వేణుగోపాల్ రూ.40 వేలు ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మచిలీ పట్నం జిల్లా అదనపు పోలీస్ అధికారి సత్యం, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ దాత డాక్టర్ నల్లూరి సుబ్బారావు, అసోసియేషన్ ఛైర్మన్ చంద్రమోహనరెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, డి.రమేష్, డాక్టర్ రవిప్రకాష్ రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిరిగిరి రంగారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో చేనేత వ్యవస్థ నిర్వీర్యం

దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర



చీరాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేనేత వ్యవస్థ నిర్వీర్యమైందని దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. చేనేత సహకార సంఘాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రభుత్వం వెంటనే ఎన్నికలు, పాలక మండలి నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఈ పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్లు విద్యుత్ జీఓకే పరిమితం అయిందని, వెంటనే అమలు పరచాలని ఆయన కోరారు. ఆప్కోకు చైర్మన్‌ను నామినేట్ చేసి ఇప్పటి వరకు జీఓ ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. చేనేత వర్గం మద్దతుతో గెలిచిన నారా లోకేష్ దీనిపై స్పందించాలని కోరారు. ఎన్నికల్లో జీఎస్టీ గురించి హామీ ఇచ్చిన ఆయన ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని తెలిపారు. చేనేతలు అభివృద్ధితో పాటు ఆకలి చావులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అభివృద్ధి పేరిట కొంగ జపం చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం పట్టించుకోకపోవడంతో ప్రజల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేనేతలకు అందిన లబ్ధి శూన్యమని పేర్కొన్నారు.

శ్రీ తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అండర్ పాస్‌లో ఇరుక్కుపోయిన లారీ



రైల్వేట్రాక్ కింద ఇరుక్కుపోయిన లారీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కరకట్ట నుంచి సీతానగరం వచ్చే మార్గంలో బకింగ్‌హామ్ కెనాల్ వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్‌లో మరోసారి భారీ వాహనం ఆదివారం ఇరుక్కుపోయింది. సీతానగరం నుంచి ఎన్టీఆర్ కరకట్ట వైపు వెళుతున్న లారీ రైల్వేబ్రిడ్జి సేఫ్టీ కోసం ఏర్పాటు చేసిన గడ్డర్‌ను దాటి ముందుకు వచ్చేసింది. బ్రిడ్జి కిందకు రాగానే లారీపై ఉన్న లోడ్ తగిలి ఇరుక్కుపోవడంతో డ్రైవర్ నిలిపివేశాడు. చివరకు టైర్లలో గాలి తీసి ముందుకు తీసుకువెళ్లారు. రైల్వే బ్రిడ్జి కింద తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతుండడంతో పెను ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి రైల్వే బ్రిడ్జికి ప్రమాదం కలగకుండా సమాంతరంగా గడ్డర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సంఘటనపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారులతో మైదానాలు కళకళలాడాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులతో క్రీడా మైదానాలు కళకళలాడాలని, ఆ విధంగా స్టేడియాన్ని తీర్చిదిద్దుతామని తూర్పు శాసన సభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. మూడు రోజుల నుంచి స్థానిక బీఆర్ స్టేడియంలో జరుగుతున్న అండర్‌–16 బాలబాలికల ఓపెన్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రూ.100 కోట్లతో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. పోటీల నిర్వాహకుడు, టెన్నిస్ కోచ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ అండర్‌–16 బాలుర విజేతగా కె.విన్సెంట్, రన్నర్‌గా జయ సాయి కుమార్ నిలిచాడన్నారు. బాలికల్లో గోలి జోషిత విజేత కాగా తనిక్షరెడ్డి రన్నర్‌గా నిలిచిందని చెప్పారు. విజేతలకు బహుమతులను నసీర్ అహ్మద్, టోర్నమెంట్ స్పాన్సర్ డాక్టర్ రామకృష్ణ, రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటేశ్వరరావు అందజేశారు.

నిర్బంధ బదిలీల ఆదేశాలు ఉపసంహరించుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నిర్బంధ బదిలీ చేయాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసి ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. లాంగ్ స్టాండింగ్‌లో లేకున్నప్పటికీ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా వెళ్లాల్సిందేనని ఒత్తిడి తీసుకువచ్చి, నిర్బంధ బదిలీపై పంపాలనే నిర్ణయాన్ని ఎస్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీసులో సీనియార్టీని పరిగణలోకి తీసుకుని, మెరిట్ జాబితా సిద్ధం చేయాల్సి ఉండగా, పుట్టిన తేదీ ఆధారంగా తయారు చేయడం నిబంధలకు విరుద్ధమన్నారు. తక్షణమే వాటిని సరిచేసి మెరిట్ ప్రకారం జాబితాలు తయారు చేయాలని కోరారు. రీ అప్పోర్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు ఓల్డ్ స్టేషన్ పాయింట్స్‌తో పాటు జత చేసిన రీ అప్పోర్షన్ పాయింట్లను తొలగించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుబ్బారెడ్డి, నాయకులు శ్యామ్, దిబ్బయ్య, బాజీ, వెంకట్రావు ఉన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

- మహానివేదన తర్వాత వీఐపీ దర్శనాలకు బ్రేక్
- అంతరాలయ దర్శనం రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగియనుండటంతో, వివాహ ముహూర్తాల నేపథ్యంలో నూతన వధూవరులు, భక్తులు, యాత్రికులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి కనిపించగా, ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు దేవస్థాన కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించారు. ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్ల క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్వదర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటలు, రూ.100, రూ.300 టికెట్‌పై దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది.



దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

వీఐపీ దర్శనాలను బ్రేక్

ఉదయం 11–30 గంటల నుంచి మధ్యాహ్నం 1–30 గంట వరకు వీఐపీ దర్శనాలను దేవస్థాన అధికారులు నిలిపివేశారు. అమ్మవారికి మహానివేదన నిమిత్తం ఉదయం 11–45 గంటల నుంచి 12–15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మహానివేదన అనంతరం రూ. 500టికెట్ల విక్రయాలను నిలిపివేసి, రూ. 300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు బంగారువాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 2గంటల వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీసేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఏడు గంటలనుంచి భక్తుల తాకిడి కనిపించింది.